
ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

నగరంలో కొనసాగుతున్న ఆస్తి పన్ను వసూళ్లు


సుభాష్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లపై నగర పాలక సంస్థ అధికారులు వేగం పెంచారు. నగరంలోని జోన్-2 పరిధిలోని వినాయక్ నగర్‌లోగల ఆస్తిపన్ను చెల్లించని దుకా ణాలను నగరపాలకసంస్థ అధికారులు సీజ్ చేశారు. ఖానాపూర్ ప్రాంతంలో ఆస్తిపన్ను పెండింగ్‌లో ఉన్న రైస్‌మిల్లులను సంద ర్శించారు. రైస్‌మిల్లు యజమానులు వెంటనే ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు. సంబంధిత ఆర్ఐ రైస్‌మిల్లుల విస్తీర్ణాన్ని తిరిగి కొలతలు తీసుకోవాలని పన్నుస్లాబ్‌రేట్ల ప్రకారం ఆస్తిపన్ను సవరించాలని ఆదేశించారు.

నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య

- నాలుగున్నర నెలల తర్వాత నియామకం
- కొత్త సీపీతో పాలన గాడిలో పడేనా?



నిజామాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పి.సాయి చైతన్య నియమితులయ్యారు. రెగ్యూలర్ ఐపీఎస్ 2016 బ్యాచ్‌కు చెందిన ఆయనను పోలీస్ కమిషనర్‌గా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం నాల్గున్నర నెలలుగా ఖాళీగా ఉన్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేసింది. ప్రస్తుతం నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా ఆయన నిజామాబాద్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద రెండోజిల్లా కావడంతో పాటు కమిషనరేట్ కావడంతో తొమ్మిదేళ్ల సర్వీసు ఉన్న రెగ్యూలర్ అధికారిని నియమించారు. బాసర జోన్ పరిధిలోనూ నిజామాబాద్ జిల్లా పెద్ద కమిషనరేట్ కావడంతో ఈ నియామకం చేపట్టారు. గత నాల్గున్నర నెలలుగా కమిషనర్ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకాగా, నేతలు కూడా పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడంతో ఈ పోస్టు నియామకం ఆలస్యమైంది. ఈ స్థానం కోసం రాష్ట్రస్థాయిలో చాలామంది ఐపీఎస్‌లు ప్రయత్నాలు చేసినా చివరకు సాయిచైతన్య బదిలీపై వచ్చారు. మచిలీపట్నం జిల్లాకు చెందిన సాయిచైతన్య నెల్లూరు కృష్ణా జిల్లాలో ప్రాథమి, ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేశారు. బీటెక్ ఐఐటీ బెనారస్ విశ్వవిద్యాలయంలో చేశారు. బీటెక్ అనంతరం సివిల్స్‌రాసిన ఆయన రెండవ ప్రయత్నంలో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. నేషనల్ పోలీస్ అకాడమిలో శిక్షణ అనంతరం భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలంలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందారు. కాటారం ఏఎస్పీగా, ములుగు ఏఎస్పీగా పనిచేశారు. అక్కడినుంచి బదిలీ అయి సౌత్‌జోన్ డీసీపీగా పనిచేశారు. ఆయన కొంతకాలం సౌత్‌జోన్ డీసీపీగా పనిచేసిన తర్వాత బదిలీచేసి నార్కోటిక్ బ్యూరో ఏఎస్పీగా నియామకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం సాయిచైతన్యను జిల్లా సీపీగా నియమించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన పదవీ బాధ్యతలను చేపట్టనున్నారు. ముక్కుసూటిగా వ్యవహరించే అధికారిగా పేరున్న ఆయనను జిల్లా సీపీగా నియమించారు. జిల్లాలో రాజకీయప్రాబల్యం ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో పనిచేసే అధికారిగా పేరున్న (తరువాయి 6వ పేజీలో..)





అటవీ సంరక్షణలో ఆడపులులు

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు వన్య మృగాలతో సాహసం చేస్తున్నారు. కొన్నేళ్లుగా మహిళలను కొన్ని రంగాలకే పరిమితం చేసినా.. వాటిని భిన్నంగా అటవీ సంరక్షణకు సైతం మహిళలు నడుం కట్టారు. రాత్రీ, పగలు తేడా లేకుండా.. ఎండా, వానా చూడకుండా.. అటవీ సంపదను కాపాడుతూ.. టేకు దొంగలను ఎదురిస్తూ.. నిత్యం ప్రాణ త్యాగాలకూ వెనుకాడడం లేదు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అటవీ శాఖ సౌత్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై ప్రత్యేక కథనం..

- అటవీ సంపద, జంతువుల రక్షణలో అతివలు
- అటవీ భూముల రక్షణ కోసం ప్రాణాలకు తెగింపు
- పురుషులతో సమానంగా విధులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం





విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ మహిళా ఉద్యోగులు

సుభాష్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : అటవీ, అటవీ ఉత్పత్తులను కాపాడడం ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బాధ్యత. ఈ బాధ్యత గతంలో పు రుషులు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం అటవీశాఖలో మహిళా ఉద్యోగులను కూడా చేర్చడంతో అటవీసంపదను కాపాడాల్సిన బాధ్యత వీరిపై పడింది. అసలు ఆడవాళ్లకే యూనిఫాం ఉద్యోగాలు ఎందుకనే ప్రశ్నల నుంచి అడ వులను రక్షించగలమని బాధ్యతలు తీసుకుని నిరూపిస్తు న్నారు. ఇటీవల సౌత్ రేంజ్ పరిధిలో అక్రమంగా భూము లను ఆక్రమిస్తున్నారన్న సమాచారం మేరకు సౌత్ రేంజ్ అధికారి రాధిక అక్కడికి వెళ్లిచూడగా ఆక్రమణదారులు మహిళా అధికారి అని చూడకుండా దాడులు చేశారు. రేంజ్ అధికారి దాడులకు బెదరకుండా భూ ఆక్రమణలను అడ్డుకోవడమే ధ్యేయంగా ఎదురుదాడికి దిగి అడ్డుకున్నా రు. వీరితో పాటు మహిళా సెక్షన్ ఆఫీసర్, మహిళా బీట్ ఆఫీసర్లు సైతం అక్కడేవిధులు నిర్వహించి ఆక్రమణలను అడ్డుకోవడంతో తమ తెగువచూపారు. సౌత్‌రేంజ్ పరిధి లో సుమారు 11వేల 780 హెక్టార్ల అడవి ఉంది. ఇందులో చిరుతలతో పాటు ఎలుగు బంట్లు తదితర క్రూరమృగాలు సైతం సంచరిస్తున్నాయి. వీటిని కాపాడుకుంటూ ఎలాంటి భయం, జంకులేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు క్రూరమృగాలు, మరోవైపు కలప స్మగ్లర్లు అన్నివైపులా నుంచి సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా విధులు నిర్వహించాల్సి వచ్చినా భయపడకుండా పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. నైట్ పెట్రోలింగ్‌లో సైతం మహిళా ఉద్యోగులు విధులు నిర్వ హించి మగవారితో తామేమీ తీసుపోమని చాటిచెప్తున్నా రు. ఒక్కోసారి ఆహారం లేకపోయినా నీటి ఆనవాళ్లు దొర కృపోయినా ఎదురొడ్డి ఉద్యోగం సాగిస్తున్నారు. దట్టమైన ప్రాంతంలో తరచుగా వచ్చే చిరుతలు, ఎలుగుబంట్లు, మానవమృగాల నుంచి గిరిజనులను రక్షిస్తున్నారు. ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకుని ఉద్యోగం చేస్తున్నారు.

• ప్రాణాలను సైతం లెక్కచేయకుండా..

ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అటవీశాఖలో మహిళా ఉద్యోగులు (తరువాయి 6వ పేజీలో..)

నాపై దాడి జరిగినా.. భయపడలేదు



• (రాధిక, సౌత్ రేంజ్ ఆఫీసర్)

అటవీ రక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నా. సౌత్‌రేంజ్ పరిధిలో నాపై దాడి జరిగినా భయపడలేదు. దాడులకు బెదిరేది లేదు. గతంతో పోలిస్తే మహిళలు అన్నింట్లో ముందున్నారు. యూనిఫాం ఉద్యోగాలకు సైతం మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఇంకా మార్పు రావాలి.

అడవులను సంరక్షించేందుకే వచ్చా..



• విజయభారతి, బీట్ ఆఫీసర్

ఎంఎస్సీ, బీఈడీ చదివినా అటవీ సంరక్షణే ధ్యేయంగా ఇష్టంతో ఉద్యోగంలో చేరా. ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకు వెళ్తున్నా. రాత్రీ పగలు తేడాలేకుండా బాధ్యత నిర్వహిస్తున్నా. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. భయపడకుండా విధులు నిర్వర్తిస్తున్నా.

సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు..



• సంయుక్త, బీట్ ఆఫీసర్

అటవీశాఖలో 14ఏళ్ల క్రితమే బీట్ ఆఫీసర్‌గా చేరాను. ఉమ్మడి జిల్లాలో అనేకచోట్ల పనిచేసి గుర్తింపు పొందాను. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నా. అటవీ ఉద్యోగం అనేక సవాళ్లతో కూడుకున్నది. ధైర్యంగా ఎదుర్కొంటూ భయపడకుండా ముందుకు సాగుతున్నా.

జిల్లాలో మహిళలే అధికం

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో పురుషుల కంటే మహిళల జనాభా అధికంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో పురుషులు 7లక్షల 71వేల 449 మంది ఉండగా.. మహిళలు 8లక్షల 5వేల 659 మంది ఉన్నారు. నిష్పత్తి ప్రకారం 1044 మంది మహిళలకు 1000 మంది పురుషులు మాత్రమే ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుండటంతో గత మున్సిపాలిటీ పాలక వర్గాలలో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతో పాటు నగర పాలక సంస్థలో మహిళలే మేయర్‌గా, మున్సిపల్ ఛైర్మన్లుగా పనిచేశారు.

కేసీఆర్‌తో సమావేశమైన కవిత, వేముల



కేసీఆర్‌తో ఎమ్మెల్సీ కవిత, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎర్రవెల్లిలో కేసీఆర్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ రజతోత్సవాలు, సంస్థాగత అంశాలు, బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు, సంబంధిత అంశాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు మరింతగా పోరాడాలని సూచించినట్లు తెలిపారు.



టెలికాం అడ్వైజరీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

• పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఎ స్ఎన్‌ఎల్ కార్యాలయంలో శుక్రవారం టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవలను గ్రామ గ్రామాన విస్తరించాలని అన్నారు. మిగతా టెలికాం సంస్థలకు అనుగుణంగా బీఎస్‌ఎన్‌ఎల్ పోటీతో పనిచేయాలని అన్నారు. ఎక్క డెక్కడ సమస్యలు ఉన్నాయో అధికారులు తెలుసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. నూతనంగా టవర్ల నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలన్నారు. గతంతో పోలిస్తే బీఎస్‌ఎన్‌ఎల్ మెరుగుపడిందన్నారు. కార్యక్రమంలో జీఎం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జీఎం జగ్‌రాం, అడ్వైజరీ కమిటీ సభ్యులు రాజు, తదితరులు ఉన్నారు.

కలగా మిగిలిన నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్



.... వివరాలు 7లో

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహర్
సా.6.30	ఉ.5.07



కొనుగోలు, అమ్మకాల్లో ఇచ్చిన అప్పులు తిరిగి రాబట్టుకోవడంలో నెమ్మదిని, సభ్రతను, మంచి నడవడికను ప్రదర్శించే వ్యక్తిని దైవం (అల్లాహ్) కరుణిస్తాడు

నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీపై
జిల్లా నేతల ఆశలు!

- షబ్బీర్ అలీ, మధుయాష్కీగౌడ్, అరికెల నర్సారెడ్డి ప్రయత్నాలు
- ఏఐసీసీ నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని వినతులు



నిజామాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతి నిధి): నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీ పదవి కోసం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్సీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ నేతలను కలుస్తున్నారు. ఎమ్మెల్యేల కోటాలో ప్రస్తుతం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీకి చేసిన సేవలను వివరించడంతోపాటు దీర్ఘకాలికంగా కొనసాగుతున్న తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కొంత మంది నేతలు ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ పెద్దలను కలుస్తూ ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. ఎలాగైనా ఈదఫా అవకాశం అందిపుచ్చుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. సీఎంతో పాటు ఇతర నేతలను కలుస్తూ చివరి ప్రయత్నాలను చేస్తున్నారు.

ఐదు స్థానాలకు నోటిఫికేషన్

కేంద్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. నాలుగు స్థానాలు కాంగ్రెస్‌కు అవకాశం ఉండటంతో ఆ పార్టీకి చెందిన ఉమ్మడిజిల్లా నేతలు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రా ష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మైనార్టీ కోటాలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆయన సీఎంతో పాటు కేంద్ర నాయకులను కలుస్తూ ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని గట్టి ప్రయత్నాలు కొ నసాగిస్తున్నారు.

నేతల లాబీయింగ్

ఏఐసీసీ నేతలను కలుస్తూ లాబీయింగ్‌ను చేస్తున్నారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ కూడా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తు న్నారు. గత ఎన్నికల్లో ఆయన ఎల్‌బీ నగర్ నుంచి పోటీ చేసినా అవకాశం రాకపోవడంతో ఈ దఫా ఆయన అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బీసీ కోటాలో తనకు తగిన ప్రాతినిధ్యం వహిస్తుందని భావిస్తున్నారు. తనకు ఢిల్లీస్థాయిలో ఉన్న పరిచయాల ఆధారంగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు ఉమ్మడి జిల్లా నుంచి పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లోనూ అసెంబ్లీ అభ్యర్థులుగా పార్టీ తరపున పోటీచేశారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి కూడా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం రాకపోవడంతో ఈ దఫా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ ముగ్గురు నేతలే కాకుండా మరి కొంత మంది నేతలు కూడా ప్రయత్నాలను చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో సామాజిక సమీకరణాలకు అనుగుణంగా ఈదఫా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ ముగ్గురు నేతలు మాత్రం తమకు దగ్గరగా (తరువాయి 6వ పేజీలో..)

- జిల్లాలో ఆరుతడి, కూరగాయల సాగు పెంచేందుకు చర్యలు
- సబ్సిడీపై డ్రిప్ అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- జిల్లాలో 2వేల హెక్టార్లలో లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు
- ఈ నెలాఖరులోపు దరఖాస్తులు చేసుకున్న రైతులకు మంజూరు



ఆరుతడి, కూరగాయల సాగుకు సబ్సిడీపై డ్రిప్‌లు

నిజామాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్‌ను పెంచేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతోపాటు ఆరుతడి పంటలు, కూరగాయల సాగు పెంచేందుకు, ఉద్యానవన తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే జిల్లా లో 2వేల హెక్టార్లకు సబ్సిడీ కింద డ్రిప్ అందించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నారు. రైతుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను రై తుల నుంచి స్వీకరిస్తున్నారు. ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ మార్చి చివరినాటికి నిర్ణీత లక్ష్యాన్ని చేరుకునేలా ఏర్పాట్లను చేస్తున్నారు. భూగర్భ జలాలపై అవగాహన కల్పించడంతో పాటు తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. వరి నుంచి కూరగాయల సాగు, ఆరుతడి పంటలకు మళ్లించే విధంగా డ్రిప్ సబ్సిడీని అందిస్తున్నారు.

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఈ యేడాది సబ్సిడీ కింద రైతులకు డ్రిప్‌ను అందించేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేసేందుకు ఆదేశాలను ఇచ్చింది. జిల్లాలో 2వేల హెక్టార్లను టార్గెట్‌గా నిర్ణయించింది. సన్న, చిన్నకారు రైతులతోపాటు పెద్దరైతులకు అందించేందుకు ఏర్పాట్లను చేస్తోంది. రైతులకు ఈ డ్రిప్‌ను ఆయా వర్గాల వారిగా విభజించి నిబంధనల మేరకు సబ్సిడీని అందించేందుకు ఏర్పాట్లను చేశారు. జిల్లాలో ఆరుతడి పంటలు ముఖ్యంగా పసుపు, కూరగాయల సాగు, పండ్ల తోటల పెంపకం చేసే రైతులకు ఈ డ్రిప్‌ను అందిస్తున్నారు. వీటితో పా టు పామాయిల్ సాగు చేసే రైతులకు కూడా అందజేస్తున్నారు. జిల్లాలో పండ్ల తోటలతో పాటు కూరగాయల సాగు పెంచేందుకు ఈ డ్రిప్‌ను అందిస్తున్నారు. ఈనెలాఖరులోపు ఆర్థిక సంవత్సరం పూర్తవుతుండటంతో ఆలోపే 2వేల హెక్టార్లకు డ్రిప్‌ను అందించే విధంగా ఉద్యానవన శాఖ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. గడిచిన మూడు నెలలుగా డ్రిప్ ఇరిగేషన్ కోసం రైతుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. రైతులు దరఖాస్తులు చేసిన విధానంలోనే సీనియారిటీని బట్టి అనుమతులను మంజూరు చేస్తున్నారు. జిల్లాలో 2వేల హెక్టార్లకు మాత్రమే అనుమతి ఉండ టంతో రైతులు కూడా ఎక్కువ మంది డ్రిప్ ఇరిగేషన్ కోసం దర ఖాస్తులను చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండటంతో ఈ సంవ త్సరం ఎక్కువ మంది రైతులు పోటీ పడుతున్నారు. పసుపు రైతులతో పాటు కూరగాయల సాగు, ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులు ఎక్కువ మంది దరఖాస్తులు చేశారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కింద సబ్సిడీని అందిస్తున్నారు. ఓసీ రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తుండగా, బీసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తూ మ ంజూరు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని అందజేస్తున్నారు. వీటితో పాటు జీఎస్‌టీ కూడా రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ యూనిట్‌కు పసుపు పంటకు హెక్టారుకు రూ.లక్షా 44వేలు, ఇతర పంటలకు రూ.లక్షా 22వేలుగా నిర్ణయించారు. దరఖాస్తులను పరిశీలించి అనుమతులను మంజూరు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 900 హెక్టార్లకు అను మతులను ఇచ్చారు. అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాల పరిధిలో ఈ డ్రిప్ (తరువాయి 6వ పేజీలో..)



నాగాపూర్‌లో కుక్కలదాడిలో 12 గొర్రెల మృతి

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగాపూర్‌లో గురువారం రాత్రి బసకొండ బాలమల్లేష్‌కు చెందిన గొర్రెల కొట్టంపై వీధి కుక్కలు దాడిచేశాయి. 12 గొర్రెలను కొరికి చంపివేయగా మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు బాధితుడు తెలిపాడు. వీటివిలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో సంఘటన స్థలాన్ని సందర్శించారు. పశువైద్యసిబ్బంది గాయపడిన గొర్రెలకు చికిత్స అందించింది. గురువారం రాత్రి బాల్కొండ మండలం కిసాన్‌నగర్ నుంచి 36 గొర్రెలను 3 లక్షల 75 వేలకు కొనుగోలు చేసి తెచ్చానని, అంతలోనే ఇలా జరిగిపోయిందని బాధితుడు మల్లేష్ కన్నీటి పర్యంతమయ్యాడు.

చెరువుల కబ్జాపై ఫిర్యాదు

ఎడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో గతంలో ఉన్న రాయకుంట చెరువు, కొత్తకుంట చెరువులు కబ్జా అయ్యాయని శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. మంగళ్‌పాడ్ గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు శుక్రవారం ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌తో పాటు బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు, ఎడపల్లి ఎస్సైకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయకుంట చెరువు 70 ఎకరాలతోపాటు దాని గొలుసు చెరువు అయిన కొత్త కుంట చెరువు 40 ఎకరాలను సైతం కబ్జా చేశారని వారు అన్నారు. మంగల్‌పాడ్ గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు రాజు, గంగాధర్,రాములు, పోశెట్టి, సాయిలున్నారు.

'మాట తప్పిన ఎమ్మెల్యే రాజీనామా చేయాలి'

ఎడపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి పూర్వవైభవం తెస్తానని హామీ ఇచ్చి మాటతప్పిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నూతన బస్టాండు వద్ద శుక్రవారం ఆయన దిష్టిబోమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, బిజేపి నాయకులు గెంటే శ్రీనివాస్ యాదవ్, కంజరి ప్రదీప్ కుమార్, సంతోష్, అభిలాష్, గంగాధర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. బోధన్ రూరల్‌లో కల్దుర్కి, సంగెం, ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నవీపేట్ : మండలంలోని రాంపూర్, నాళేశ్వర్ 33/11సబ్ స్టేషన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఎల్‌కే ఫారం, ఫత్తేనగర్, దర్యాపూర్ తండా, ఫస్ట్ ప్లాట్ గ్రామాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని, నాళేశ్వర్ 33/11సబ్ స్టేషన్ పరిధిలో నాళేశ్వర్, తుంగిని గ్రామాలలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

మట్కారాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న పలువురిని అరెస్టు చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు మట్కా నిర్వహిస్తూ, ఆడుతున్న సునీత, సతీష్, గణేష్, ఇర్ఫాన్, నదీమ్, గోపిలను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, ఆరుసెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'లబ్ధిదారులు ఇళ్ల పనులు ప్రారంభించాలి'

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు యుద్ధప్రాతిపాదికన పనులు ప్రారంభించుకోవాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో నాగాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి రాజా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్‌మిట్ లెవల్ వరకు నిర్మించుకుంటే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖతాల్లో చేరుతాయన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించుకోవడానికి లబ్ధిదారులకు ఆర్థికస్థోమతలేని లబ్ధిదారులకు తమతమ మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయాలు కల్పించాలని ఆయా సంఘాల సమాఖ్య కార్యవర్గసభ్యులు చూపాలన్నారు.

'ప్లాస్టిక్‌ను వాడవద్దు'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్‌టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రతీఒక్కరూ తక్కువ మైక్రేన్ గల ప్లాస్టిక్‌ను వాడవద్దని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 16 వార్డులో తడిపొడి చెత్త, హానీకరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌లో వేసి, కాలనీని శుభ్రంగా ఉంచుకోవా లని ఆయన సూచించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షన్ 2024 ఫీడ్‌బ్యాక్‌ను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ అవినాస్, మెప్మా ఆర్‌పీ వాణి, మున్సిపల్ సిబ్బంది నరేష్, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

వేల్పూర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నందిని కళాబృందం ఆధ్వ ర్యంలో హెచ్‌ఐవీ నివారణపై కళాబృందం వారు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నారాయణ, ఆరోగ్యకార్యకర్త రాధిక, ఆశవర్కర్ శ్రీదేవి, కళాకారులు పాల్గొన్నారు.

చారిత్రక స్థలాలను సందర్శించిన విద్యార్థులు

భీమ్‌గల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని చారిత్రక స్థలాలను సందర్శించారు. నెహ్రూ, జూపార్కు, గాంధీభవన్ తదితర ప్రదేశాలను సందర్శించారు. వీరి వెంట ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు రఘువాస్, ఇమ్మానియేల్, భూమేశ్వర్, రాధిక, రాణి ఉన్నారు.

ఆల్‌ఇండియా పోలీస్‌గేమ్స్‌కు ఎంపిక

జక్రాన్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆల్‌ఇండియా పోలీస్‌గేమ్స్‌కు కలిగోట్‌కు చెందిన పూర్వవిద్యార్థి, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేష్ ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా పోలీస్‌గేమ్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మోక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, పాఠశాలలో పని చేస్తున్న ఆయమ్మలను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు బర్ల సాయిలు, కిడ్స్ సభ్యులు తాటి వీరేశం పాల్గొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డ్వాక్రా మహిళాసంఘాలు బ్యాంకు నుంచి రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సకాలంలో చెల్లించాలని పొతంగల్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున శెట్టి పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముఖ్యఅతిథి ప్రిన్సిపాల్ పెద్దన్న మాట్లాడుతూ మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ దశరథ, డాక్టర్ బ్యూల, మహిళ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : మండలంలోని చేపూర్‌లో గల క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగుమీడియం ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేల్పూర్ : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కేంద్రంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రేణుక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ఎస్‌టీజీ యూనియన్ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ప్రధానకార్యదర్శి సునీల్, క్యాషియర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మహిళా ఉపాధ్యాయుల సన్మానం



పొతంగల్‌లో..

బోధన్‌రూరల్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 5వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి అజయ్ కుమార్, అదనపు ప్రథమ శ్రేణి న్యాయాధికారి సాయి శివ, ద్వితీయ శ్రేణి న్యాయాధికారి శేషతల్ప సాయి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్ రావు, డాక్టర్ సమ్మయ్య, సీహెచ్‌వీ హన్మంత్ రావు ఉన్నారు.



వేల్పూర్‌లో సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు



పెర్కిట్‌లో...

బోధన్‌లో సబ్‌కలెక్టర్ ఆకస్మిక పర్యటన

బోధన్‌రూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో పట్టణంలోని పలు వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ టాకీస్ పక్క నుంచి తట్టికోటకు పోయే రోడ్డుమార్గంలో ఉన్న కల్వర్టును పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. శక్కర్‌నగర్ ఎన్ఎస్ఎఫ్ గ్రౌండ్‌ను, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. 23వ వార్డులో గల నర్సరీని పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

బోధన్ మండలంలోని సంగం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం బోధన్ మండల విద్యాధికారి నాగయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతులలో బోధనను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, సంధ్య, వెంకటలక్ష్మి, వసుంధర, స్రవంతిలతో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న బోధన్‌లో సబ్‌కలెక్టర్

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అంకాపూర్‌లో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని హరితహారం నర్సరీ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రభవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హారిక, సర్వేయర్ రత్నకర్, ఆర్‌ఐ ఉన్నారు. గ్రామాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంకాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

రెంజల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో రైతు వేదికలో శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పండుగలను శాంతియుతవాతావరణంలో జరుపుకుని సోదరభావంతో మెలిగినప్పుడే పండుగలు ప్రశాంతంగా జరుపుకున్న వారమవుతారని ఆయన అన్నారు. రంజాన్ పండుగ దృష్ట్యా శాంతికమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అందరు కలిసి మెలిసి పండుగలను జరుపుకోవాలని, శాంతిభద్రలకు ఎలాంటి విఘాతం కలిగించకూడదని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాయన్న, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బినోలలో పునఃప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం

నవీపేట,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో శ్రీ సింధూర సిద్ది వినాయక స్వామి ఆలయ జీర్ణోద్దరణ, పునః ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటితో పాటు పాటు శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి, శ్రీ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి భక్తులకు ప్రవచనలు అందజేశారు. కార్యక్రమంలో పురోహితులు కృష్ణప్రసాద్ జోషి పాల్గొన్నారు.

తొర్లికొండలో విగ్రహాల ప్రతిష్టాపన

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండలో శుక్రవారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్ళి విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రవచనాలు ఇస్తున్న పీఠాధిపతి

ధర్మోరాలో వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే



బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ధర్మోరాలో నూతనంగా నిర్మించిన వేంకటే శ్వరస్వామి దేవాలయంలో ప్రతిష్టాపన కార్య క్రమంలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుద ర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు లోక భూపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటి రోజున ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులతో యజ్ఞం నిర్వహించారు. ముఖ్యఅతిథి లుగా ముస్కు అనుప్‌కుమార్ ఆధ్వర్యంలో మహాగణపతిపూజ, హారతి, మంత్రపుష్పం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ధర్మోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు గదుల నిర్మాణానికి ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డి రూ.12లక్షల వితరణ చేయగా బోధన్ ఎమ్మెల్యే, మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి పనులకు భూమిపూజ చేశారు. అనుప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గుడికి, బడికి పెద్దఎత్తున విరాళం ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించిన ముస్కు అనుప్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు రఘునందాచారి అనుప్‌కుమార్‌రెడ్డిని, ఆయన తండ్రి ముస్కురాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అనుప్‌కుమార్‌రెడ్డి ఐదేళ్లుగా విద్యావాలంటీర్లకు ప్రతీనెల రూ.10 వేల చొప్పున చెల్లిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు భూపతిరెడ్డిలు ప్రసంగిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న అనుప్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వడ్లగంగాధర్, యోగేష్‌గౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి దేవేందర్, ముస్కు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పఠాని గంగాధర్, రవికాంత్, గణేష్‌గౌరవ్, క్రాంతికుమార్, టి.రాజేశ్వర్, శ్రీనివాస్, హన్మాండుల, నాగమణి, రేణుక నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి..

ఆర్మూర్‌టౌన్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మోర్తాడ్ మండలం ధర్మోరాకు వెళ్తున్న సుదర్శన్‌రెడ్డిని ఆర్మూర్ అంబేద్కర్‌చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పట్టుశాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్పశ్రీనివాస్, చిట్టిరెడ్డి, నర్మేశ్రీనివాస్, విజయ్‌అగర్వాల్ పాల్గొన్నారు.

ఎంపీ ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మ దహనం

నవీపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మను శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై ఎంపీ అరవింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, భగవాన్, చల్లా రవీందర్ తదితరులున్నారు.

'అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయండి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిన అంగన్‌వాడీ కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో జిల్లా పరిషత్ పాఠశాల అవరణలో అంసపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మద్యం సీసాలు, పేక ముక్కలు దర్శనం ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, భజరంగ్ హన్మాండ్లు, శ్యామ్, రాజు, సాయిలు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివి, ఉన్నతస్థాయికి ఎదగాలని కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పొతంగల్ ఎంఈవో లోల శంకర్, ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు సాయిలు, నవీన్ పాల్గొన్నారు.

'ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన దుండగుడిని శిక్షించాలి'

కోటగిరి,మార్చి7(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన దుండగుడిని శిక్షించాలని ఆశా యూనియన్ అధ్యక్షురాలు భూలక్ష్మి డిమాండ్ చేశారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆశా యూనియన్ కార్యకర్తలు శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్‌పై అత్యాచారానికి ఒడిగట్టిన దుండగుడిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు వాణి, లత, లక్ష్మి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నల్లాలకు బిగించిన మోటార్లు సీజ్

భీమ్‌గల్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో మిషన్ భగీరథ నల్లాలకు మోటార్లు బిగించి నీటని వృథా చేస్తున్న వారికి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఎనిమిది మోటార్లను సీజ్ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని, నల్లాలకు మోటార్లు బిగిస్తే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ప్రజలకు హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జక్రాన్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం జక్రాన్‌పల్లి మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ.40 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ నిధులు మంజూరు చేయించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, డిష్‌రాజు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

రెంజల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రెంజల్ శివారులో డీసీఎం ఢీకొని ద్విచక్రవాహనదారుడు నరక సత్యనారాయణకు గాయాలయ్యాయని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ ఉదయం తన ద్విచక్ర వాహనంపై నవీపేటకు వెళ్తుండగా కళ్యాపూర్ చౌరస్తాలో ఎదురుగా డీసీఎం వాహనం అతివేగంగా ఢీకొట్టింది. అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొనగా సత్యనారాయణకు గాయాలయ్యాయి. డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చికిత్స పొందుతూ అటెండర్ మృతి

బోధన్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లపు గంగాధర్ చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు బోధన పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం యాసిడ్ సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. చికిత్స పొందుతూ బోధన్‌లో గురువారం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి తల్లి పల్లపు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారని ఆయన తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రెంజల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. కందకుర్తి గోదావరిలో మహిళ మృతదేహన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

'నవోదయ పాఠశాలను తరలించొద్దు'

జక్రాన్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మంజూరైన జవహర్ నవోదయ పాఠశాలను కలిగోట్ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్‌లు కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి అర్బన్ ఎమ్మెల్యే విరాళం



విరాళాన్ని అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

రెంజల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సాటాపూర్‌లో నిర్మిస్తున్న రామాలయానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా 25 వేల రూపాయల విరాళాన్ని రామాలయ కమిటీ చైర్మన్ నితిన్‌కు అందజేశారు. మేక సంతోష్, కుర్మె సాయిలు, ప్రేమ్‌కుమార్, కమటం గంగారాం తదితరులున్నారు.

ఆమే ఆకాశం.. వనితకు వందనం!

● అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఆర్మూర్‌రూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కర్యేషుదాసి, కరణేషుమంత్రి, భోజ్యేషుమాత, శయనేషు రంభ అని ఒక సినికవి చెప్పినట్టు ప్రతీ మగాడి విజయంలో స్త్రీ పాత్ర లేనిది అతనికి మనుగడే లేదు. సమాజ నిర్మాణంలో సగ భాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం ఇదే నినాదంతో ఐక్య రాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతీఏటా నిర్వహిస్తోంది. మహిళ ఒక అమ్మగా జన్మనిస్తుంది. భార్యగా బాధ్యతలు మోస్తుంది. అక్కగా కష్టాల్లో తోడుంటుంది. కూతురిగా ప్రేమను పంచుతుంది. ఇలా ఎన్నో విధాలుగా కర్తవ్యాలను మహిళలు నిర్వర్తిస్తున్నారు. పుట్టిన నాటి నుంచి ప్రాణం పోయే వరకు తనంటేనే సేవ అంటూ పురుషులకు ప్రేమను అందిస్తుంది. ప్రతీ విషయంలో పురుషులకు చెదోడు వాదోడుగా ఉంటూ ధైర్యాన్ని ఇస్తుంది. ప్రతిఫలంగా కొంచెం ప్రేమను, ఓదార్పును మాత్రమే కోరుకుంటుంది స్త్రీమూర్తి. ఇలా అకాశంలో సగభాగంలా నిలిచిపోయింది.

రంగమేదైనా మహిళలదే కీలకపాత్ర..

అన్ని రంగాలలో మహిళలు తమ సత్తాను చాటుతూ ఉన్నత శిఖరాలకు చేరుకొని పురుష శక్తికి తమేమి తీసుకుపోమని చాటుచెబుతున్నారు. తాము ఇంటికే పరిమితం కాదంటు పురుషులకు దీటుగా విజయం సాధిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, క్రీడలు, రాజకీయాలు ఇలా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళ సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు.

సర్పంచ్‌లుగా.. వ్యవసాయదారులుగా..

● సట్లపల్లి సవిత, సట్లపల్లి గంగ నర్సుబాయి, మాజీ సర్పంచ్‌లు



మహిళలు వ్యవసాయ రంగంలోనే కాకుండా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాజకీయ రంగాల్లో కూడా రాణిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా ఎంపీపీలు, జడ్పీటీసీలుగా తమ దైన శైలిలో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెం దిన పలువురు వ్యవసాయం పనులు చేస్తునే ప్రజా ప్రతినిధులుగా పనిచేసి గుర్తింపు తెచ్చుకు న్నారు. మహిళలు ఎవరికి తీసిపోరాని అన్ని రంగాల్లో రాణిస్తూ నిరూ పిస్తున్నారు. సుర్బి ర్యాల్ గ్రామానికి చెందిన సట్లపల్లి సవిత, సట్లపల్లి గంగనర్సుబాయి తోటికోడళ్లు. ఒక వైపు వ్యవసాయం చేస్తునే సర్పంచ్‌లుగా రాణించారు.

వ్యవసాయంలో మహిళలదే ప్రధానపాత్ర..

● సుప్రియ, రైతు, రాంపూర్



వ్యవసాయ రంగంలో మహిళలే ప్రధాన పాత్ర. ఆర్మూర్ ప్రాంతం వ్యవసాయంలో దేశంలోనే పేరుగాం చడం వెనుక మహిళల కృషి ఎంతో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వ్యవ సాయంతో పాటు విద్య, వైద్యం, క్రీడలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. తాను ఉన్నత విద్యనభ్యాసించినప్పటికీ వ్యవసాయం చేస్తూ కుటుంబానికి చెదోడువాదోడుగా నిలుస్తున్నాను.

సీజనల్ వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్న మహిళ..

● పొన్నాల స్పందన, ఆర్మూర్



ఆర్మూర్ పట్టణానికి చెందిన పొన్నాల స్పందన సీజనల్ వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి చెదోడు వాదోడుగా ఉంటూ అదనపు ఆదాయం ఆర్జిస్తుంది. సంక్రాంతి పర్వదినాల్లో గాలిపటాలు, రాఖీ పౌర్ణమి నాడు రాఖీలు అమ్ముతూ, హోలీ నాడు రంగులు అమ్ముతూ, దీపావళికి నాడు బాణసంచాలు, విక్రయిస్తూ వ్యాపారంలో రాణిస్తుంది. స్పందన గతంలో మహిళ సంఘంలో రూ.10వేల రుణం తీసుకొని వ్యాపారం ప్రారంభించి ప్రస్తుతం రూ.2లక్షల బ్యాంకు రుణాల ద్వారా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తోంది. గత 13ఏళ్లుగా సీజనల్ వ్యాపారాలు చేస్తూ రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది.

అతివలు... ఆదర్శప్రాయులు

మద్నూర్: ఉద్యోగ నిర్వహణలో తమ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలానికి చెందిన పలువురు అధికారులు ఒకప్పుడు పురుషులకే పరిమితమైన రాజకీయాల్లో నేడు సగానికి పైగా మహిళలు సమయస్ఫూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి మ ద్నూర్ మండలంలో ప్రభుత్వ పాలనలో మహిళలదే అగ్రరాజ్యం. పురుషులతోపాటు మేము సైతం అంటూ అన్ని రంగాల్లో రాణిస్తూ మద్నూర్, డోంగ్లి మండలాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా మహిళలు ప్రాధాన్యత వహిస్తున్నారనే చెప్పవచ్చు. మండల స్థాయిలో మహిళా అధికారినులు పాలన వ్యవహరిస్తూ పదవులకు ఆదర్శంగా నిలిచారు. ఎంపీడీవో రాణి, డోంగ్లి మండల తహసీల్దార్ రేణుక చౌహాన్, ఏపీవో పద్మతో పాటు డోంగ్లి పిహెచ్‌సి వైద్యురాలు శ్రీలేఖ మహిళా అధికారులుగా పలు శాఖల్లో వ్యవహరిస్తున్నారు. మద్నూర్ మార్కెట్ చైర్ పర్సన్‌గా సౌజన్య రమేష్ రైతుల ఇబ్బందులు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారిక సాధించవచ్చని వీరు రుజువు చేస్తున్నారు. మహిళా ఇంటికి పరిమితం కాదు సమాజంలో పురుషులకంటే తామేమి తక్కువ కాదని నిరూపిస్తున్నారు. మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు ఉండాలి ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలి ఆడపిల్లలనే చులకన భావం భావం సమాజంలో పోవాలి అంటున్నారు. మహిళా ఉద్యోగులు నేడు ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

స్వశక్తితో ఎదగాలి

● పద్మ ఏపీవో



ప్రతీ మహిళ స్వశక్తితో ఎదగాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. ఉద్యోగం, కటుంబం సామాజిక పరంగా సమానమైన బాధ్యత కలిగి ఉండాలి. సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెంది నైపుణ్యం కలిగి ఉండాలి. అక్షరాస్యత కలిగి ఉండాలి. ఉన్నత చదువులు చదువుకోవాలి. ఏదైనా సాధించే శక్తి మహిళల్లో ఉంది.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

● రేణుక చౌహాన్, తహసీల్దార్, డోంగ్లి



అన్ని రంగాలలో మహిళలు ముందుండాలి. ఉద్యోగం. క్రీడలతో పాటు అన్ని రంగాలలో చైతన్యం కలిగి ఉండాలి. కుటుంబ నిర్వహణలో బడ్జెట్ అనే పదానికి మారుపేరే మహిళ. ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలి.

● ధైర్యంగా ఎదుర్కొవాలి: రాణి, ఎంపీడీవో



ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి. ఎదుర్కొనే ధైర్యం మహిళల్లో ఉంటుంది. కాని అది గుర్తించం. అడ పిల్లలనే చులకన భావన సమాజంలో ఉండకూడదు. పోరాడే శక్తి మహిళల్లో ఉంది. ప్రతి అంశంలో మహిళలు పురుషులు సమానమే.

అందుబాటులో ఉండాలి

● సౌజన్య మార్కెట్ కమిటీ చైర్మన్



ప్రజలకు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించినప్పు డే మంచి పేరు వస్తుంది. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నాను. అదేవిధంగా ప్రజా ప్రతి నిధులు సైతం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి శాయాశక్తులా కృషి చేయాలి

పట్టుదలతో ప్రభుత్వ కొలువు

● లావణ్య, ఏవో, భీమ్‌గల్



భీమ్‌గల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రణాళిక ద్వారా లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ దిశగా చదువులో ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు అని భీమ్‌గల్ పట్టణ కేంద్రానికి చెందిన లావణ్య ఏవో గా కొలువు సాధించి ఆదర్శంగా నిలిచింది. పట్టణ కేంద్రానికి చెందిన బద్దం లింగయ్య అనసూయకు దంపతుల కూతురు లావణ్యకు చిన్నప్పటి నుంచి చదువుపై ఉన్న మక్కువను గమనించి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. పదవ తరగతి వరకు పోచంపాడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువు పూర్తి చేసిన ఆమె ఇంటర్మీడియేట్ దర్మారంలో పూర్తిచేసింది. పై చదువుల నిమిత్తం హైదరాబాద్‌లోని ఆచార్య ఎన్‌జీ.రంగా యూనివర్సిటీలో డిగ్రీ అగ్రికల్చర్ బీఎస్సీ అదే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రభుత్వ ఉ ద్యోగం సాధించేందుకు ప్రాతినిత్యం కష్టపడింది. 2009లో ఏవో (అగ్రికల్చర్ ఆఫీసర్)గా ఉద్యోగం సాధించి నందిపేట్‌లో బాధ్యతలు చేపట్టింది. అనంతరం మోర్తాడ్, బాల్కొండ, ప్రస్తుతం భీమ్‌గల్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్నారు. ఉత్తమ ఏవోగా పప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని కూడా అందుకున్నారు. 2008లోనే పట్టణ కేంద్రానికి చెందిన పర్స నవీన్‌తో వివాహమైంది. వీరికి కూతురు కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ముందుకు సాగాలి. ప్రతినిత్యం గంటల తరబడి చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమమయ్యారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు.

అటు అంగన్‌వాడీగా.. ఇటు పూజారులుగా రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు



ఉద్యోగాలతో పాటు పౌరోహిత్యంలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు

కమ్మర్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అతివలు ఎందులోనూ తీసిపోరంటూ నిరూపిస్తూ పురుషులతో సమానంగా సమాజంలోని అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కష్టాల కడలిని ఈదుకుంటూ కృషి, పట్టుదల తమ సొంతమంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. విద్య, వైద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ, రాజకీయ తదితర అన్ని రంగాల్లోనూ అతివలు మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. కాగా ఒక వైపు ఐసీడీఎస్ భీమ్‌గల్ సెక్టార్‌లోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లుగా, ఆలయాల్లో పూజారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో వైపు వంశపారంపార్యంగా వస్తున్న పౌరోహిత్యంలోనూ రాణిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన హన్మాండ్లు పంతులు నర్సూబాయి దంపతుల తొలి నలుగురు సంతానంలో నలుగురు ఆడపిల్లలే అయితే హన్మాడ్లు పంతులు పురోహితుడుగా, పూజారిగా రాణిస్తూనే ఆడపిల్లలకు చదువులు చెప్పించడంతో పాటు పెళ్లిళ్ల, పేరంటాలకు తన వెంట తీసుకునిపోతుండేవారు. ఈ క్రమంలో అటు ఆలయాల్లో పూజలు చేయడం, ఇటు పురోహితులుగా నిర్వహించే కార్యకలాపాలు నేర్చుకున్నారు. పెళ్లిళ్ల తరువాత వారివారి గ్రామాల్లో స్థిరపడ్డారు. పెద్దకూతురు ప్రణవేశ్వరి ప్రస్తుతం చౌట్‌పల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. మరో వైపు గ్రామశివారులోని శ్రీఉమా పార్థీవ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నారు. రెండో కూతురు రాజేశ్వరి ప్రస్తుతం మోర్తాడ్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూనే పౌరోహిత్యంలో రాణిస్తున్నారు. మూడో కూతురు భువనేశ్వరి వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇక నాలుగో కూతురు జ్ఞానేశ్వరి మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామంలో మొదట ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకుంటూ గ్రామంలోనే అంగన్‌వాడీ టీచర్‌గా చేరారు. ప్రస్తుతం ఐసీడీఎస్ భీమ్‌గల్ సెక్టార్‌లో ఏసీపీడీవోగా పనిచేస్తున్నారు. మగసంతానం లేని హన్మాండ్లు పంతులుకు ఆడబిడ్డలే కొడుకుల్లా మనోధైర్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.



పురోహితురాలిగా పెళ్లి జరిపిస్తున్న ప్రణవేశ్వరి

జిల్లా కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సంబరాలు చేసుకుంటున్న మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల సూచించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాటాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పలు సూచనలు చేశారు. మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో మహిళల ప్రాధాన్యత గురించి పలు అంశాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం న్యాయసేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఇంకా చాలా విషయాలలో ఒకరికొకరు తోడ్పాటును అందించు కోవాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ మహిళలు ఇంట్లో పనులు చేస్తూ ఉద్యోగ పరంగా ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం మహిళా న్యాయవాదులు అహల్యబాయి, న్యాయదేవత, డాక్టర్ ఆనంద్‌బాయి, జాన్సీబాయి దేశ్‌ముఖ్, మధర్ థెరిస్సా వేషాధారణలు ధరించి మహిళా స్ఫూర్తిని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిలు, మహిళా న్యాయ వాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

● రాజశ్రీ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి



నేడు మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్య విషయంలో మాత్రం కొంచం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అనేక అనారోగ్య సమస్యలు మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్, ఇతరత్ర వ్యాధుల విషయంలో ముందు నుంచి జాగ్రత్తలు వహిస్తే అనారోగ్యబారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు తాను ఇచ్చే సందేశం ఒక్కటే. మహిళలు తమ అనారోగ్య సమస్యలను ఆదిలోనే గుర్తించి చికిత్సలు చేసుకుంటే బాగుంటుంది. - నిజామాబాద్ అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● మణిదీపిక, మండల వ్యవసాయశాఖ అధికారిణి దోమకొండ



దోమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దోమకొండ మండల వ్యవసాయ శాఖ అధికారిణి మణిదీపిక అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తల్లిదండ్రుల సహకారంతో ఉనత్న చదువులు చదువుని ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందన్నారు.తాను ఏవోగా ఉద్యోగంలో జాయిన్ అయిన సమయంలో అబ్బాయిలతో సమానంగా 80 మంది అమ్మాయిలు జాయిన్ కావడం జరిగిందని ఆమె తెలిపారు.

మహిళలు అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

● డాక్టర్ బి.కావ్య, మెడికల్ ఆఫీసర్, నవీపేట



నవీపేట, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైన ఉందని నవీపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బండారి కావ్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తమ స్వస్థలం బోధన్‌లోని శక్కర్‌నగర్ అని, తండ్రి బండారి వెంకటేశ్వర్లు వ్యాపారవేత్త కాగా తల్లి లక్ష్మి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అక్క చందనకు వివాహం కాగా సోదరుడు శివసాయి అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడని అన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో తాను 2015 నుండి 2021వరకు ఖమ్మంలోని మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదివానని ఈ సమయంలో మూడు గోల్డ్ మెడళ్ల సాధించినట్లు ఆమె వివరించారు. 2023సంవత్సరంలో తాను ప్రభుత్వ వైద్యురాలిగా నవీపేట ఆసుపత్రిలో నియామకం అయినట్లు ఆమె వివరించారు. సమాజంలో తల్లిదండ్రులు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచాలని అప్పుడే దేశంలో మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించడం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.కావ్య ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

అనతి కాలంలోనే వ్యవసాయ అధికారిగా..

● భానుశ్రీ,మండల వ్యవసాయ అధికారి, రామారెడ్డి



రామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ అనేది కాలంలోనే ప్రభుత్వ అధికారిగా నియామక మయ్యారు. సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన భానుశ్రీ ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (మాస్టర్ ప్లాంట్ పాథాలజీ) పోస్టు సాధించి పై అధికారుల చేతు ల మీదుగా ఉత్తమ గోల్డ్ మెడల్ అవార్డును అందు కున్నట్లు ఆమె వివరించారు. చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకున్నానని ఎంఎస్సీ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో రామారెడ్డి మండల వ్యవసాయ అధికారిగా నియమకం అయినట్లు వివరించారు.

కలగా మిగిలిన నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్



నీరు లేక బోసిపోయిన స్విమ్మింగ్ పూల్ ఇదే

● పాలకులు, అధికారులు పూర్వ వైభవం తెచ్చేనా!?

నిజాంసాగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్ కలావిహీనంగా మారింది. దీంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. పాలకులు, అధికారులు స్విమ్మింగ్ పూల్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నైజాం హయాంలో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలో దాదాపు ఎకరం భూమిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేసి జాతికి అంకితం చేశారు. కాలక్రమమైన అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా స్విమ్మింగ్ పూల్ నిర్వహణ సక్రమంగా లేక స్విమ్మింగ్ పూల్ నీరు లేక బోసి పోయింది. ఎండాకాలం వచ్చిందంటే పర్యాటకులు సిమ్మింగ్ పై ఎంతో ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. కానీ నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్‌లో దాదాపు 40 సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ పాలకులు, అధికారులు మరమ్మతులు చేయించి స్విమ్మింగ్ పూల్ పునర్ ప్రారంభించాలని ఆలోచన లేక పోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. 1986 వరకు నామమాత్రంగా స్విమ్మింగ్ పూల్‌లో నీరు ఉండేవి అప్పట్లో నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు నిజాంసాగర్ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ ఆహ్లాదకరంగా గడిపేవారు. కాలక్రమేనా ఈ స్విమ్మింగ్ పూల్‌లోనికి వచ్చే పైపులైన్లు శిథిలమై నీరు రాకుండా పోయింది. అధికారులు, పాలకులు చూసిచూడనట్టుగా వివరిస్తూనే ఉన్నారు. కానీ ఎన్నికలు వచ్చాయంటే నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు పరిరక్షణంగా తీర్చిదిద్దామని హామీ ఇస్తూనే ఉన్నారు. హామీలు కలగానే మిగిలిపోతున్న పట్టినట్టుగా వివరిస్తున్నట్లు విమర్శలు వినిపి స్తున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతచరించుకున్న పర్యటన కేంద్ర పుణ్య నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అని చందంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు జరిపి జాతికి అంకితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



స్విమ్మింగ్ పూల్‌లోకి దూకేందుకు అప్పట్లో నిర్మాణం చేసిన రైలింగ్



స్విమ్మింగ్ చేసే వారు సేద తీరేందుకు అప్పట్లో నిర్మించిన కాటేజ్

అటవీ సంరక్షణలో ఆడపులులు

(3వ పేజీ తరువాయి)

విధులను నిర్వహిస్తున్నారు. సౌత్‌రేంజ్ పరిధిలో కొంతభాగంలో దట్టమైన అడవి ఉంది. కలపను దొంగిలించేందుకు స్మగ్లర్లు రాత్రి పగలు లేకుండా సంచరిస్తుంటారు. వారిని అడ్డుకట్ట వేసేందుకు అటవీమార్గంలో ప్రాణాలు లెక్క చేయకుండా కాపుకాస్తుంటారు. జంతువుల నుంచి రక్షణ పొందేందుకు ఆయుధాలు పెద్దగా లేకపోయినా ఉన్న వాటితోనే జంతువులను ఢీకొట్టడానికి రెడీగా ఉంటారు. స్మగ్లర్ల కోసం ఎప్పటికప్పుడు రాత్రిపగలు లేకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తారు.

ఆక్రమణదారులతో ఎప్పుడూ ప్రమాదమే..

రోజురోజుకు అంతరించిపోతున్న అడవిని కాపాడడం కోసం అటవీ భూఆక్రమణదారులను అడ్డుకోవడం వీరి ప్రధాన బాధ్యత. ఇందులో భాగంగా పోడు కొట్టడం, అటవీభూముల్లో వ్యవసాయం చేసే రైతులను అడ్డుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతానికి వెళ్లి కందకం తీయాల్సి ఉంటుంది. ఆ సమయంలో గిరిజనుల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. కొందరు గిరిజనులు అధికారులపై దాడులు చేస్తున్నారు. దాడుల్లో గాయాలైనా లెక్కచేయకుండా సిబ్బంది అడవిని కాపాడేందుకు కృషిచేస్తున్నారు.

నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య

(3వ పేజీ తరువాయి)

ఆయనను నియమించడంతో పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేస్తారని భావిస్తున్నారు.

పాలన గాడిలో పడేనా..

జిల్లాలో నాల్గున్నర నెలలుగా పోలీస్ కమీషనర్ లేకపోవడం వల్ల శాంతి భద్రతలతో పాటు జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో పనితీరుపై పలు ఆరోపణలు వచ్చాయి. గత సీపీగా పనిచేసిన కల్మేశ్వర్ సింగెనవార్ సంవత్సరం కాలంలో రెండు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పూర్తిస్థాయిలో కంట్రోల్ చేశారు. ఆరోపణలు వచ్చిన అధికారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు దర్యాప్తు చేసి కొంత మంది అధికారులను సస్పెండ్ చేశారు. మరికొంత మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నా ఆయన శాంతిభద్రతలను కాపాడటంలో ముందున్నారు. ఇసుక అక్రమ రవాణాతో పాటు నేరాలను అరికట్టడంలో ముఖ్యపాత్ర పోషించారు. రాత్రుళ్లు పర్యటించడంతో పాటు ఆయా పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులతో పాటు సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉండే విధంగా చూశారు. దొంగతనాలు వంటివి అరికట్టడంలో కృషి చేశారు. గత నాల్గున్నర నెలలుగా పలు పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. కొంత మంది అధికారులు ఇసుక, మట్టి మొరం రవాణాతో పాటు భూ దందాల్లో కూడా తమ ప్రభావాన్ని చూపిస్తున్నారు. కొన్ని సెటిల్‌మెంట్లు కూడా చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే కేసుల్లో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న అధికారుల తీరుపై ఇప్పటికే మల్టీజోన్-1 ఐజీకి పలు ఫిర్యాదులను అందించారు. కొంత మందిని బదిలీ చేయగా మరి కొంత మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కొంత మంది అధికారులను కమీషనరేట్‌కు అటాచ్ చేశారు. స్థానిక నేతల సహకారంతో కొంత మంది అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో చెలరేగిపోతున్నారు. కొత్తగా వస్తున్న కమిషనర్‌కు వీరిని అరికట్టడమే సవాల్‌గా మారనుంది. జిల్లాలో రాజకీయ ప్రాబల్యం కూడా ఎక్కువగానే ఉంది. జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే సున్నితమైనది. మహారాష్ట్రతో సరిహద్దులుగా ఉన్న జిల్లా కావడంతో ఇక్కడ సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. దొంగతనాలతో పాటు పీఎఫ్ఐ వంటి కేసులు కూడా నమోదై ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ఘర్షణలు జరిగే ప్రాంతం కావడంతో సమన్వయంతో పనిచేయాల్సి ఉండటం వల్ల రెగ్యూలర్ అధికారిని నియమించారు. కొత్త అధికారిని నియమించడం వల్ల జిల్లాలోని పోలీస్ శాఖ అధికారులు మాత్రం అప్రమత్తం అయ్యారు.

సబ్సిడీపై డ్రిప్‌లు!

(3వ పేజీ తరువాయి)

ఇరిగేషన్ అందే విధంగా చూస్తున్నారు. వరిసాగు చేసే రైతులకు మినహాయించి ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు వీటిని మంజూరు చేస్తున్నారు. పామాయిల్ సాగు కూడా సబ్సిడీపైనే అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5600 ఎకరాల్లో పామాయిల్ సాగును చేపట్టారు. ఆ రైతులకు కూడా సబ్సిడీ కిందనే డ్రిప్‌ను అందించారు. పామాయిల్ గెల టన్నుకు రూ.20వేలకు పైగా ధర పలుకుతుండటం వల్ల ఈ పంటను కూడా ఎక్కువగా సాగు చేసే విధంగా ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో కూరగాయల సాగును పెంచేందుకు బోధన్ డివిజన్ పరిధిలో ప్రయోగాత్మకంగా 150 ఎకరాలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతీ రైతుకు అర ఎకరంలో కూరగాయల సాగు చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఆ రైతులకు 50 శాతంకు పైగా సబ్సిడీ ఇవ్వడంతో పాటు డ్రిప్‌ను కూడా అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో కూరగాయల సాగు తక్కువగా ఉండటం వల్ల ప్రోత్సహించేందుకు మొదట బోధన్ నియోజకవర్గం పరిధిలో ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ నెలలోనే మంజూరు చేసి రైతులు కూరగాయల సాగు చేపట్టే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే రైతులను గుర్తించిన ఉద్యానవన శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మంజూరు చేయనున్నారు. జిల్లాలో ఆరుతడి పంటలతో పాటు ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను సబ్సిడీపై అందిస్తుందని ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ జేడీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం 2వేల హెక్టార్లకు ఈ డ్రిప్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. కూరగాయల సాగు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీపై జిల్లా నేతలు ఆశలు!

(3వ పేజీ తరువాయి)

ఉన్న నేతల ద్వారా ప్రయత్నాలను చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు పూర్తిస్థాయిలో అవకాశాలను ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మొదటి దఫాలో మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఆయన తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ప్రభుత్వం ఏర్పడగానే షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా అవకాశాన్ని కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, కాసుల బాల్‌రాజులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను కల్పించారు. సీనియర్ నేత గడుగు గంగాధర్‌కు వ్యవసాయ కమీషన్ సభ్యుడిగా నియమించారు. జిల్లాకు చెందిన సినీ నిర్మాత దిల్‌రాజుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురికి పదవులు వచ్చాయి. మొదటి దఫాలో ఎమ్మెల్సీగా కూడా అవకాశం వచ్చింది. ఈ దఫా ఇతర జిల్లాలకు అవకాశం ఉన్నా ఉమ్మడి జిల్లా నేతలు మాత్రం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అవకాశం వస్తే కలిసివస్తుందని వారు ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు మాత్రం సామాజిక సమీకరణాలు అనుకూలిస్తే జిల్లాకు అవకాశం వస్తుందని వారు అంటున్నారు. నేతల ప్రయత్నాలు ఎంతవరకు కలిసివస్తుందో ఒకటి రెండు రోజుల్లో తేలనుంది.

ప్రతీ గ్రామానికి నర్సరీ : ఎంపీడీవో

ధర్పల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో ఓ నర్సరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని సీతాయిపేట్ గ్రామంలో గల నర్సరీతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మార్కెట్, స్మశాన వాటిక, డంపింగ్ యార్డులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ హరితహారానికి నర్సరీలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రతీ మొక్క ను రక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో 9వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సీతాయిపేట గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశామని ఈ గ్రామంలో 113 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు మార్క్‌అవుట్ ఇచ్చారు. మోడల్ ఇందిరమ్మ ఇళ్లను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలి

ధర్పల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలని తహసీల్దార్ మాలతి సూచించారు. శుక్ర వారం మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలోగల ప్రాథమిక పాఠశాల ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీచేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పేలా చూడాలన్నారు. ప్రభుత్వం పిల్లలకు మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్‌లు ఇస్తోందని చెప్పారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో రాజీపడవద్దన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు.

అవసరమైన ప్రతీచోట ట్రాన్స్‌ఫార్మర్లు

• డీఈ ఉత్తమ్ జాడే



100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ

ధర్పల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఓవర్‌లోడ్ అధిగమించేందుకు అవసరమైన ప్రతీచోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్ జాడే తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలకేంద్రంలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని తదనుగుణంగా అన్నిగ్రామాల్లో అవసరమైన ప్రతీచోట నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే 200 నూతనట్రాన్స్‌ఫార్మర్లు బిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇవేకాకుండా వినియోగదారుల విజ్ఞప్తి మేరకు అవసరమైన ప్రతీచోట బిగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వివరించారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో గల 33/11 సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ఆయన ప్రారంభించారు. 18 స్థంభాలను బిగించి 11కేవీ తూంపల్లికి అధనంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వేసవి మొదటి నుంచే తగిన ఏర్పాట్లుచేస్తున్నామని ఆయన చెప్పారు. వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను బిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ గౌతమ్, సీనియర్ ఇన్స్‌పెక్టర్ బాబురావు, వీడీసీ చైర్మన్ గుండయ్య, కమ్మరి గంగాధర్, సాయిలు, రవి, శ్రీనివాస్, మనసు, శంకర్, లైన్‌మెన్ అశోక్ పాల్గొన్నారు.



డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను కలిసిన జయం కేపీఎం రైతు ఉత్పత్తిదారుల ప్రతినిధులు

డీఆర్‌డీవోను కలిసిన రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు

నిజామాబాద్ అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మనోహరబాద్ గ్రామానికి చెందిన జయం కేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, పుప్పాల నగేష్ శుక్రవారం డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను కలిశారు. పసుపు పరిశ్రమలో పండించిన విలువ ఆధారిత వస్తువులను ఆయన పరిచయం చేస్తూ పసుపు పౌడర్‌ను అందజేశారు. జిల్లాలోని ఐకేపీ ద్వారా మహిళా సంఘాలకు కూడా పసుపు పరిశ్రమ ద్వారా ఉపాధి కల్పించవచ్చని, జిల్లాలోని మహిళా సంఘాలకు ఈ పరిశ్రమలు పరిచయం చేయాలని కోరారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లులో ఉన్న లోపాలను సరిచేయాలి'

డిచ్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి డప్పు నర్సయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లులో లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి బస్టాండ్‌వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల మాదిగ సభ్యులు డప్పులతో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూషణ్, కిష్టయ్య, యమున, సత్తెక్క, సాయిలు, సురేష్, పోషన్న, తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీకి టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ పంపిణీ

నిజామాబాద్ అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీనగర్‌లోగల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో కోరమండల్ కంపెనీ లిమిటెడ్, ఇక ఫౌండేషన్ సంయుక్తంగా మానసిక దివ్యాంగులకు రూ.లక్ష విలువచేసే టీచింగ్ లర్నింగ్ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరమండల్ సంస్థ జోనల్ హెడ్ మురళీకృష్ణంరాజు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ హెడ్ మానస, మహేష్, ఇక ఫౌండేషన్ డైరెక్టర్ కిశోర్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

'నోటి క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తిస్తే నయం చేయవచ్చు'

నిజామాబాద్ అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ప్రబలుతున్న నోటి క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చునని యశోద ఆసుపత్రి సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ వైద్యుడు సోమశ్రీకాంత్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నోటి క్యాన్సర్ ప్రజారోగ్య సమస్యలా మారిందని, దీన్ని గుర్తించడం ఆలస్యం కావడంతో మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి నయం చేయవచ్చన్నారు. సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ నర్సింహారెడ్డి, శ్రీరాంసురేష్‌లు పాల్గొన్నారు.

మూడవ రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్ష మూడో రోజు శుక్రవారం ప్రశాంతంగా సాగింది. జిల్లావ్యాప్తంగా 57 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 18,649 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 17,997 మంది హాజరుకాగా 652 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ బోర్డు పరీక్షల విభాగం డిప్యూటీ సెక్రెటరీలు యాదగిరి, ఖాదర్ షరీఫ్‌లు ధర్పల్లిలోని రెండు పరీక్ష కేంద్రాలను, భీంగల్‌లోని రెండు పరీక్ష కేంద్రాలను, మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఐఈవో రవికుమార్ నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాల నిక్షిప్తం చేసిన విధానాన్ని పరిశీలించి కస్టోడియన్ ప్రశ్నపత్రాల పంపిణీని పరిశీలించారు. 57 పరీక్ష కేంద్రాలకు గాను 49 పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, హైపవర్ కమిటీ తనిఖీ చేశాయి. డీఐఈవో రవికుమార్ నగరంలోని పలు కళాశాలలను తనిఖీ చేశారు.

బీజేపీ మండల కార్యవర్గం ఏర్పాటు

సిరికొండ, మార్చి7 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ సిరికొండ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా గుర్రపు సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధర్పల్లి బాబురావు, మాలావత్ రాజేందర్, ఉపాధ్యక్షులుగా నలుగురిని, కార్యదర్శులు నలుగురు, కోశాధికారిగా ఎస్.గోపిని నియమిస్తూ జిల్లా కార్యదర్శి నక్కరాజేశ్వర్ ప్రకటించారు. అధికార ప్రతినిధిగా ఎస్.ఎం. రంజిత్‌రెడ్డి, మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

ఆర్టీసీ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్, కన్వీనర్‌గా సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో శుక్రవారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా కె.రాజేందర్, వైస్‌చైర్మన్లుగా శేఖర్, జీపీరాం, జీఎం చందర్, గంగాధర్‌లు, కమిటీ సభ్యులుగా దశరథ్, మూర్తి, పోశెట్టి, ఆర్‌ఆర్ సింగ్, రవీందర్, తిరుపతి, బి.శ్రీనివాస్, లక్ష్మణ్, జిజిరాం, కమిటీ చీఫ్ అడ్వైజర్లుగా గోపి, వీవో దాస్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా సేయింట్ జేవియర్స్ పాఠశాల స్నాతకోత్సవం



మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వర్ని రోడ్‌లోగల సేయింట్ జేవియర్స్ పాఠశాల స్నాతకోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ మార్గం కాకుండా చదువును అవగాహన చేసుకొని చదవాలన్నారు. త్వరలో జాతీయ విద్యావిధానం అమలు కానుందని అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను వెలికి తీసేలా పాఠశాలలు సైతం ఆ దిశగా ముందడుగు వేయాలన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంతో పాటు వారిలో చదువుపట్ల అవగాహనను పెంపొందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సంసిద్ధం కావాలని ఎలాంటి మానసిక ఒత్తిడిలకు లోనుకాకుండా ప్రశాంతంగా చదువుపై దృష్టిపెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నర్సరీ, పీపీ-1, పీపీ-2 విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాయరెడ్డి, పాఠశాల చైర్మన్ నర్సింహారావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

'ఎమ్మెల్యేలను విమర్శించేస్థాయి దినేష్‌కు లేదు'

డిచ్‌పల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కోట్లాది నిధులతో అభివృద్ధి పనులుచేస్తున్న మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలను విమర్శించేస్థాయి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్ నవోదయ పాఠశాలను జక్రాన్‌పల్లి మండలంలో ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఎమ్మెల్యే భూపతిరెడ్డి లేఖను అందించారని గుర్తు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన నవోదయను బోధన్‌కు మార్చాలని సుదర్శన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని దినేష్ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అవగాహన రహితంగా ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలపై ఆరోపణలు మానుకోవాలన్నారు. సమావేశంలో శ్యాంసన్, వాసు, ధర్మగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ పరీక్ష ఫలితాల విడుదల

నిజామాబాద్‌అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేసినట్లు డీఈవో అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2025లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల ఫలితాలను బీఎస్‌ఈ. తెలంగాణ. జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా చూసుకోవాలని డీఈవో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

నిజామాబాద్‌కల్చరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని ముస్లింలు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీద్ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు మధ్యాహ్నం ప్రార్థనలుచేశారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ ప్రత్యేకప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో ముస్లింలు పేదలకు వస్త్రాలు, పండ్లు దానం చేశారు.

గురుశ్రేష్ట అవార్డుకు ఎంపిక

నిజామాబాద్ కల్చరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన రచయిత, కవి ప్రేమ్‌లాల్ గురుశ్రేష్ట అవార్డుకు ఎంపికయ్యాడు. సాహిత్య, విద్యారంగంలో విశేష కృషి చేసిన వారికి మధర్‌థెరిస్సా ట్రస్ట్ విజయవాడ వారు అందించే అవార్డు ఈ సంవత్సరానికి జిల్లాకు చెందిన ప్రేమ్‌లాల్ ఎంపికైనట్లు కమిటీ తెలిపింది. ఈనెల 9న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందజేయనున్నారు. అవార్డు రావడం పట్ల సాహితీవేత్తలు, సాహితీ సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88,800	రూ.81,950	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1
: చావా (తెలుగు) (10.00)
: కింగ్‌స్టన్ (1.20, 7.40)
: చావా (హిందీ) (4.20)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)

స్క్రీన్-2
: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (10.15)
: చావా (హిందీ) (1.30, 10.50)
: శివంగి (4.50)
: చావా (తెలుగు) (7.30)

స్క్రీన్-3
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.25)
: చావా (తెలుగు) (1.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (4.55, 7.50)
: కింగ్‌స్టన్ (10.45)

స్క్రీన్-4
: నారీ (10.35)
: మిక్కీ17 (ఇంగ్లీష్) (1.10)
: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (4.05, 10.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1
: చావా (తెలుగు) (11.00, 1.45, 4.40, 10.30)
: చావా (హిందీ) (7.40)

స్క్రీన్-2
: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (1.30, 7.30)
: నారి (4.40)
: రా రాజ (10.30)

స్క్రీన్-3
: జిగేల్ (11.00)
: కింగ్‌స్టన్ (1.30, 7.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (1.30, 10.20)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహల్ : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (11.15, 2.15, 6.15, 9.15)

\- నిజామాబాద్ అర్బన్